
# అహింస మరియు శాకాహారం




రూ. 15/-

అహింసో పరమోధర్మః

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ - ఇండియా

# అహింస మరియు శాకాహారం



## బ్రహ్మర్షి పత్రీజీ

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ - ఇండియా

# అహింస మరియు శాకాహారం

ప్రచురణ : **తటవర్తి వీర రాఘవరావు**

2008 సం॥రం : ఒక ముద్రణ
ప్రతులు : 12,000
2009 సం॥రం : నాలుగు ముద్రణలు
ప్రతులు : 45,000
2010 సం॥రం : ఐదు ముద్రణలు
ప్రతులు : 42,000
2011 సం॥రం : రెండు ముద్రణలు
ప్రతులు : 24,000
2012 సం॥రం : ఆరు ముద్రణలు
ప్రతులు : 75,000
2013 సం॥రం : రెండు ముద్రణలు
ప్రతులు : 12,000
2014 సం॥రం : రెండు ముద్రణలు
ప్రతులు : 12,000
2015 సం॥రం : రెండు ముద్రణలు
ప్రతులు : 12,000
2016 సం॥రం : మూడు ముద్రణలు
ప్రతులు : 15,000
2017 సం॥రం : ఒక ముద్రణ
ప్రతులు : 6,000
2018 సం॥రం : ఒక ముద్రణ
ప్రతులు : 6,000
2019 సం॥రం : మూడు ముద్రణలు
ప్రతులు : 6,000
2021 సం॥రం : రెండు ముద్రణలు
ప్రతులు : 14,000
2022 సం॥రం : ఒక ముద్రణ
ప్రతులు : 10,000

వెల రూ. **15/-**




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

## ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

వివరాలకు : ***తటవర్తి వీరరాఘవరావు,***
*తటవర్తి వారి వీధి, భీమవరం - 534 201.*
*సెల్ : 94403 09812, 94901 71853*

# మాంసాహారం ఎందుకు మానాలి?

ప్రపంచంలోని సర్వమతాలకు చెందిన ధార్మిక పురుషులు, విజ్ఞానులు అందరూ హింస, ద్వేషం, క్రూరత్వం ఇవన్నీ పాపాలుగా పేర్కొన్నారు. ఇతర జీవకోటిని అకారణంగా బాధించడం, నొప్పి కలిగించడం పాపమని వారు ముక్తకంఠంతో ఘోషించారు. గర్హించారు. అహింస, దయ, క్షమ కరుణ మరియు ప్రేమ మతంగా పరిగణించారు.




ప్రతి జీవిలోనూ పరమాత్మను చూడడమే వారి ముఖ్య ఉద్దేశం. శవాలను ఆహారంగా భుజించడాన్ని ఖండించారు.

ఇటువంటి విషతుల్యమయిన మరియు రోగకారకమైన మాంసం తినడం వల్ల నయం కానటువంటి ఎన్నో వ్యాధులకు గురవుతారు **"నన్నెలా నీవు తింటున్నావో అలాగే నేనూ నిన్ను తింటున్నాను" అని జంతువులు తమ కసిని తీర్చుకుంటున్నాయన్నట్టుగా ఆ రోగ బాధ అనిపిస్తుంది.**

సకల జీవరాసులూ మనలాగే పరమాత్మునిచే సృష్టించబడినవి. ఆ సృష్టికర్త తాను సృష్టించిన బిడ్డలను తనవాళ్ళే విచక్షణారహితంగా హత్య చేస్తుంటే చూస్తూ భరించగలడా? ముమ్మాటికి కాదు! ప్రతి మనిషీ అలాంటి మూల్యాన్నే ఏదో ఒకనాడు చెల్లించవలసి వస్తుంది.

**జంతువులను చంపడం ద్వారా లభించిన మాంసాన్ని తినడం శవాన్ని తినడంతో సమానం.**

# అత్యాచారము



**నోరులేని మమ్మల్ని పట్టి, వేపమండలు కట్టి, నడు, నడు అని కర్రతో కొట్టి, శూరులవలె క్రిందకు నెట్టి, చురకత్తిచేతబట్టి, మా తలలు నరికే మానవులు దేవుని వద్ద పాపాలు లెక్కకట్టవలసిందే!**

ఓ! మాంసాహారాన్ని భుజించే సహోదరులారా! మరోసారి మీరు మాంసాన్ని తినడానికి సిద్ధమయ్యేముందు, దయచేసి కోళ్ళ పెంపక కేంద్రాలనూ మరియు జంతువధశాలలనూ దర్శించి, మూగజీవుల నరకయాతనలను, వాటి బాధా-భయాలనూ, వాటి ముఖంలో తాండవించే భయానక దృశ్యాలనూ మీ కళ్ళతో తిలకించండి. అవి ఏ విధంగా చంపడతాయో గమనించండి.

కోళ్ళను అమ్మే దుకాణంలో గంపల్లో, ఇనుప జాలీల్లో ఇరుకుగా ఒకదానిపై ఒకటి వుంచుతారు. వాటికి ఆహారం, నీరు ఇవ్వరు. అవి ఆకలి, దప్పికతో అలమటిస్తూ వుంటాయి. వాటి ఎదుటే ఒక్కొక్క కోడిని కోస్తూ వుంటారు. వాటిని చూస్తూ అవి త్వరలో తమకు పట్టబోయే నరకాన్ని తలచుకుంటూ అవి పొందే భీతి, భయం వర్ణనాతీతం.

అంతేకాదు కోళ్ళను ఒక చోటు నుండి మరో చోటుకు రవాణా చేయడం చూస్తే మానవులు ఎంత దయ లేకుండా ప్రవర్తిస్తున్నారో అర్థమవుతుంది. సైకిళ్ళ మీద తలక్రిందులుగా వ్రేలాడ తీస్తారు. వాటి తలలు చక్రాలలో పడి నలుగుతూ వుంటే అవి మూగగా రోదించడం తప్ప ఏమీ చేయలేవు. కొంతమంది సంతలో కొన్న కోళ్ళను ఒక చేత్తో కూరలు పంచి మరొక చేత్తో కోళ్ళను రెక్కలు విరిచి పట్టుకుని నడుస్తారు. ఇవి అత్యంత దయనీయమైన దృశ్యాలు. వీరికి వాటి మీద దయ ఎప్పటికి కలుగుతుందో?

కసాయి దొడ్లలోని జంతువులకు ఏమి జరగబోతున్నదనే విషయం

**జంతువులను చంపేవాడు స్వర్గానికి వెళ్ళలేడు - మనుస్మృతి**

వాటిపట్ల ప్రవర్తించే విధానం వల్ల వాటికి ముందే తెలుస్తుంది. మేకలను, గొర్రెలను కర్రలతో కొట్టి మరీ లోపలకు నెడతారు. ఆవులను, గేదెలను ముల్లు కర్రతో పొడిచి, పొడిచి, తోకలను మెలితిప్పి మరీ లోపలకు లాక్కువెళతారు. అలా నెట్టివేయబడ్డ జీవులు రక్తంతో నిండివున్న నేలపై కట్టివేయబడతాయి. అవి తమ తోటి జంతువుల గొంతులు కోయబడటం చూస్తూ, తమకు ప్రాప్తించబోయే నరకాన్ని వూహించుకుంటూ, తమ అంత్యకాలం కోసం ఎదురుచూస్తుంటాయి. అలా నిర్దోషులైన మూగజీవాలపై జరిపే అత్యాచారాన్ని చూసి కరగని గుండె నిజంగా రాతి గుండే కాని వేరు కాదు.


అలాగే పందిని చంపటానికి ముందు తాళ్ళతో బంధిస్తారు. ఇద్దరు ముగ్గురు దానిపైకి ఎక్కి పొడవైన గునపాన్ని దాని గుండెలోకి గుచ్చుతారు. అది బాధతో భయంకరంగా పెట్టే అరుపులు ఎంతో దూరం వినిపిస్తాయి. ఒక్కొక్కసారి గుండెలో గునపం దిగకపోతే గునపాన్ని బయటకు తీసి వేరొక చోట గుచ్చుతారు. అలా అది చావటానికి అరగంట, ముప్పావుగంట పడుతుంది. అలా అది హృదయ విదారకంగా అరుస్తూ ప్రాణాలు విడుస్తుంది. కొంతమంది కాలుతున్న చువ్వలను గుచ్చి చంపుతారు. కొంతమంది పంది కాళ్ళు, నోరు తాళ్ళతో కట్టి మంటల్లో వేసి కాల్చి చంపుతారు.

చేపలను పట్టుకోవడానికి బ్రతికియున్న వానపామును తుంపి గాలానికి గుచ్చుతారు. వానపాము గిలగిలలాడుతుంది. చేప దృష్టి దానిపై పడి ఆకర్షితమవుతుంది. అది వానపామును తినటానికి వేగంగా వస్తుంది. గాలానికి చిక్కుకుంటుంది. దాన్ని బయటకు లాగి బుట్టలో వేయడమో, తీగెకు గుచ్చడమో చేస్తారు. ఆ చేప అలా గిలగిలా తన్నుకుంటూనే వుటుంది. అది ప్రాణమున్న జీవి అన్ని భావం వారికి ఏ కోశానా ఉండదు.

ఉత్తర ప్రదేశ్‌లో చేపలు పట్టేవాళ్ళు చాలామంది మొసలి మాంసాన్ని కూడా తింటారు. వారు మొసలిని పట్టుకుని తాళ్ళతో బంధించి అవసరాన్ని బట్టి దాని కాళ్ళు, తోక నరుకుతారు. అలా మొసలి ఎన్నో రోజుల పాటు గిలగిలా కొట్టుకుంటూ వుంటుంది.

అలా జంతువులు చంపబడటాన్ని చూసినట్లయితే చాలామంది తప్పనిసరిగా మాంసం తినటం మానివేస్తారు. అందుచేత మాంసం తినేవారు చంపబడటాన్ని చూడాలి! జీవుల హింస ఆగాలి! అందరూ మాంసభక్షణ మానాలి!

**హృదయంలో ప్రేమ, దయ లేని పాపాత్ములే కసాయి వారివలె ప్రవర్తిస్తారు.**




అసలు చిన్న చీమ కాని, దోమ కాని కుడితేనే సహించలేని మానవునికి జంతువులను చంపి, హింసించే హక్కు ఎక్కడిది? అలా కుట్టినందుకే వాటికి మరణ దండన విధిస్తున్నాడే! మరి జంతువులను చంపుతున్న మానవులకు ఏ శిక్ష వెయ్యాలి? ఒక్కసారి ఆలోచించండి.

ఆహారం మన ప్రవర్తనని మరియు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. కాబట్టి మనం తీసుకునే ఆహారం మన శారీరక, మానసిక, సామాజిక మరియు ధార్మిక వికాసానికి ఉపయోగపడాలి. అంతేకానీ ఆవేశాన్ని కలిగించి మానసిక అస్వస్థతను కలిగించేవిగా ఉండకూడదు.

**భగవంతుడు మానవులకు నిర్దేశించిన ఆహారం**

ప్రకృతి విరుద్ధంగా ప్రవర్తించడమంటే పరమాత్మ ఆజ్ఞను ధిక్కరించడమే. అటువంటి వారు పరమాత్మ నిర్దేశించిన శిక్షను ఎదుర్కోవలసి వస్తుంది. ఆహారం విషయంలో భగవంతుడు ఎవరికి ఏ ఆహారం నిర్దేశించాడో వాటి శరీర నిర్మాణాన్ని బట్టి తెలుసుకోవచ్చు.





ఆహారం శుద్ధంగా వుంటేనే మన అంతరం శుద్ధంగా వుంటుంది.

ఉదాహరణకు:-

1. మాంసాహార జంతువులకు, కోర దంతాలు, పదునైన గోళ్ళు ఉంటాయి. శాకాహార జంతువులకు అవి వుండవు.

2. మాంసాహార జంతువులు నమలకుండానే మింగుతాయి. శాకాహార జంతువులు ఆహారాన్ని నమిలిన తరువాతే మింగుతాయి.

3.మాంసాహారం తినే జంతువులు నాలుకను బయటకు చాపి నీళ్ళు త్రాగుతాయి. శాకాహారం తినే జంతువులు నీరు త్రాగడానికి పెదవులను వినియోగిస్తాయి.

4. మాంసాహార జంతువుల ప్రేవులు చిన్నవిగా ఉండడం వల్ల తిన్న మాంసాహారం కలుషితం కాకముందే బయటికి విసర్జిస్తాయి. శాకాహార జంతువుల ప్రేవులు పెద్దవిగా ఉండటం వల్ల అంత తొందరగా తిన్న ఆహారాన్ని విసర్జించలేవు.

5. మాంసాహార జంతువుల కాలేయం మరియు మూత్రపిండం పెద్దవి కావడంతో మాంసం యొక్క వ్యర్థపదార్థాల్ని సునాయాసంగా బయటికి నెట్టగలవు. కాని శాకాహార జంతువులకు చిన్నవిగా ఉండటం వల్ల వ్యర్థపదార్థాల్ని అంత సునాయాసంగా బయటకు నెట్టలేవు.

6. మాంసాహార జంతువుల జీర్ణ కోశంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఎక్కువగా వుండటంతో సులభంగా జీర్ణం చేసుకోగలవు. శాకాహార జంతువులలో చాలా తక్కువ వుండటం వల్ల మాంసాన్ని అంత సులభంగా జీర్ణం చేసుకోలేవు.

7. మాంసాహార జంతువులు వాసనను చాలా తీవ్రంగా పసిగట్టగలవు. రాత్రి సమయంలో వాటి కళ్ళు వెలుగుతాయి. మరియు వాటి రాత్రి దృష్టి పగటి దృష్టితో సమానంగా ఉంటుంది. కాని, శాకాహార జంతువులు వాసన అంతగా పసిగట్టలేవు. వాటి రాత్రి దృష్టి పగటి దృష్టిలా వుండదు.

8. మాంసాహార జంతువుల అరుపులు చాలా కర్ణకఠోరంగా, భీతిగొలిపేలా ఉంటాయి. కాని, శాకాహార జంతువుల అరుపులు అంత కఠోరంగా ఉండవు.

9. మాంసాహార జంతువుల పిల్లలు, అవి జన్మించిన ఏడు రోజుల వరకు వాటి కంటి చూపు దాదాపు శూన్యం. కాని శాకాహార జంతువుల పిల్లలు, అవి జన్మించిన మరుక్షణం నుండే సాధారణ కంటి చూపును కలిగి వుంటాయి.

మానవుని శరీరం కూడా శాకాహార జీవులైన ఆవు, గుర్రం, మేక,ఒంటె, ఏనుగు, జిరాఫీలాంటి వాటివలె నిర్మించబడింది. మనిషిని

మినహాయించి ఏ ఇతర ప్రాణి కూడా ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తించడానికి ఇష్టపడదు. సింహం ఆకలి మీదున్నా గడ్డి తినదు. అలాగే ఆవు ఆకలితో అలమటిస్తున్నా మాంసం ముట్టుకోదు.

మాంసం తినే జంతువులు, తమ జీవితకాలమంతా మాంసంతోనే గడుపుతాయి. కారణం అవి వాటి సంపూర్ణ ఆహారం కాబట్టి. కానీ మనిషి కేవలం మాంసాహారం మాత్రమే తింటూ రెండు-మూడు వారాలకు మించి బ్రతకలేడు. కాని, సంపూర్ణ శాకాహార భోజనంతో మనిషి సుదీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించగలడు.

ఇది గమనించి మానవులు భగవంతుడు నిర్దేశించిన విధంగా శాకాహారం తీసుకోవాలి. శాకాహారులు కావాలి. శాకాహారులు అధిక శక్తి కలవారే కాక, కష్టపడి పనిచేయగలరని, అలసట లేకుండా భారమైన పనులు కూడా చేయగలరని చాలామంది పరిశోధకులు కనుగొన్నారు. బ్రిటన్‌లో నేడు పదిలక్షల పై చిలుకు ప్రజలు పూర్తిగా శాకాహారులే, ప్రస్తుతం వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది కూడా. అమెరికాలో మొత్తం అయిదుకోట్లకు మించి శాకాహారులున్నారు.

గ్వాలియర్‌కు చెందిన డా.జస్‌రాజ్‌సింగ్ మరియు సి.కె.దావన్ అనే ఇద్దరు పరిశోధకులు గ్వాలియర్ జైలులోని 400మంది నేరస్థుల మీద పరిశోధన చేశారు. 250 మంది మాంసాహారాన్ని భుజించే నేరస్థుల లో 85 శాతం తలబిరుసుతనం మరియు తగువు పెట్టుకునే తత్వం కల వారుగా, తక్కిన 150 మంది శాకాహారాన్ని భుజించే నేరస్థులలో 90శాతం శాంతంగా మరియు ఉల్లాసంగా ఉండేవారుగా వారు కనుగొన్నారు.

అమెరికా ప్రత్యేక వైద్యుడు డా.విలియం సి.రాబర్ట్స్, అమెరికాలో హృద్రోగగ్రస్థులు శాకాహారులకన్నా మాంసాహారులలోనే అధికమని చెప్పారు.

మాంసం తినేవారిలోకన్నా శాకాహారులలో సహజ రోగనిరోధశక్తి అపారమని కూడా అమెరికా వైద్యులు పేర్కొన్నారు. మాంసాహారులు సాధారణంగా మలబద్ధక పీడితులవడం వల్ల తమకు తామే అనారోగ్యాన్ని కలుగచేసుకుంటున్నారు.

జంతువధశాలలో మరణానికి ముందు నిస్సహాయస్థితిలో జంతువు తనను తాను రక్షించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ దాని కోసం పోరాడుతుంది. ఎప్పుడు పోరాటం విఫలమౌతుందో దాని భయాందోళనలు తీవ్రస్థాయికి చేరి, కళ్ళు క్రోధంలో ఎరుపెక్కి నోటినుంచి నురగలు

**మాంసం వాసనకు ముక్కు మూసుకుంటారు. మరల మాంసం తింటారు**

వెలువడతాయి. ఈ స్థితి జంతుశరీరంలోని 'ఆడ్రెనాలిన్' అనబడే ఓ పదార్థం ఏర్పడి, రక్తపుపోటు అధికమై రక్తం కలుషితమవుతుంది. ఇలాంటి మాంసాన్ని మనిషి తింటే, ఈ 'ఆడ్రెనాలిన్' మనిషిలో కూడా ప్రవేశించి అతనికి అనేక ప్రాణాంతక వ్యాధులు కలుగచేస్తుంది. జంతువు మరణించిన మరుక్షణం సకల జీవ పరిరక్షాక్రియలు ఆగిపోయి, బ్యాక్టీరియా, వైరస్‌తో కూడిన అంటురోగాలు శరీరంలో వ్యాపిస్తాయి.

ఇది మనిషి శరీరంలో ప్రవేశించి ఎంతటి ప్రాణాంతకమయిన

**మలం తింటే మమ్మల్ని వదిలేస్తారని మలం తింటున్నాం. అయినా మానవులు మమ్మల్ని కూడా వదలకుండా చంపి మా మాంసాన్ని తింటున్నారు.**




వ్యాధుల్ని ప్రేరేపిస్తుందంటే, అవి మాంసాహారాన్ని తినేవారిని అంత్యదశ వరకూ వదిలిపెట్టవు. "నేడు ఎవరు మాంసాన్ని తింటున్నారో, ఏదో ఒకనాడు దానిచేతనే వారు తినబడతారు". అన్నది తెలుసుకోవాలి. ఏ జీవియైనా బాధపడటం చూసి చలించేవాడు మాంసం తినడం గురించిన ఆలోచనే చేయడు.

ఒక పిల్లవాడికి బాల్యంనుండే జంతువులను చంపడం, మాంసం భుజించడం అలవాటు చేస్తే, అతను సహజంగానే స్వార్థపూరిత ప్రవర్తనతో ఇతరులను బాధపెట్టడం, ఇతర జీవులను తన విందు-వినోదాల కోసం చంపటం అలవర్చుకుంటాడు. ద్వేషించడం, యాతనకు గురిచేయడం, హింసించడం మరియు చంపడం ఏ విధంగానూ తప్పకాదన్నంతగా అతని ప్రవర్తన ఉంటుంది. అలాంటి వాడికి అహింస, దయ, సత్‌ప్రవర్తన లాంటి గొప్ప భావాలు అతని హృదయంలో అంకురించడానికి అవకాశమే ఉండదు.

**నాలుక రుచి కోసం జంతువులను వధించడం ధర్మమైతే మరి అధర్మమని దేనిని అంటారు?**

**జీవులను ప్రేమించే తత్వం లేనివాడు తల్లిదండ్రులను ఎలా ప్రేమిస్తాడు? వృద్ధాప్యంలో కాని ఈ విషయం తల్లిదండ్రులకు అర్థం కాదు.**

ప్రపంచంలో నేడు హింస, ద్వేషం, మరియు ద్రోహపూరిత చింతనలు పెరగడానికి, మాంసం తినడమే మూలకారణం. మాంసం తినడం వల్ల కోరికలు మరియు కామం అంకురించి, అగ్నిజ్వాలల్లా చెలరేగుతాయి. వాటిని ఎంత ఎక్కువగా సంతృప్తి పర్చితే అవి అంత అధికమవుతాయి. ఆ కోరికలను తీర్చుకోవడంలో ఎలాంటి అవరోధాలేర్పడినా, కోపం తారాస్థాయికి చేరుతుంది. మంచి-చెడుల విచక్షణాజ్ఞానాన్ని నశింపచేసి అమానుష కృత్యాలకు పాల్పడేలా చేస్తుంది.

# జీవులతో వ్యాపారం

జీవుల్ని చంపడం లేక చంపడానికి ప్రోత్సాహించడం లేక జీవుల ద్వారా సంపాదించి కూడబెట్టుకున్న డబ్బు ఎప్పటికీ ఆరోగ్యకరం కాదు, వారు మనశ్శాంతిగా జీవించలేరు.

సంసారంలో బాంధవ్యాలు సరిగా లేకపోవటానికి ఇదొక ముఖ్య కారణం. అందుచేత ఈ క్రింది విషయాలు ధర్మబద్ధమయినవి కావని తెలుసుకోవాలి.

1) ధనార్జన నిమిత్తం చేపలు, పక్షులు మరియు జంతువులను పెంచడం మరియు చంపడం.

2) విందుల కోసం చేపల్ని, పక్షుల్ని, జంతువుల్ని చంపడం.

3) వినోదం కోసం కోళ్ళు, పొట్టేళ్ళు, మరియు ఎద్దుల మధ్య పోరాటాలు, పందాలు పెట్టడం, ప్రోత్సహించడం.


4) జీవులను చంపి వాటి తోలు (జంతు చర్మం), నారక్రొవ్వులు, తైలాలు మరియు రెక్కల నాధారంగా వస్తు సామాగ్రిని తయారుచేయడం.




5) పక్షులను పట్టుకొని పంజరాల్లో బంధించడం, చేపలను తొట్టెలలో పెంచడం, వాటిని విక్రయించడం ద్వారా సంపాదించడం.

విష్ణువు మత్స్యావతారం ఎత్తాడంటారు. మరి చేపలను తినడం ఎందుకు మానరు?

# కోడిగ్రుడ్లు ఆరోగ్యకరమైన ఆహారమా?



కోడిగ్రుడ్లు ఆరోగ్యకరమైన ఆహారం కాదు. కారణం గుడ్లు భుజించడం వల్ల ఏర్పడే వ్యాధుల గురించి ఇటీవల పరిశోధనలో కనుగొన్న అంశాలు తెలుసు కుందాం.

అమెరికాకు చెందిన డా॥ ఇ.బి.ఎమారీ మరియు ఇంగ్లాండుకు చెందిన డా॥ఇన్హా గ్రుడ్లు మనుషులకు విషతుల్యమయినవిగా పేర్కొంటూ 'పోషకత్వం' మరియు 'రోగుల స్వభావం'పై ఇటీవల కనుగొన్న విషయం' అన్న పుస్తకంలో స్పష్టంగా అంగీకరించారు.

ఇంగ్లాండుకు చెందిన డా॥ఆర్.జె.విలియమ్ , 'ప్రారంభంలో గ్రుడ్లు తినేవారు ఎక్కువ బలం చేకూరినట్లుగా భావించినా, ఆ తరువాత వారు గుండెజబ్బులు, చర్మవ్యాధులు, పక్షవాతం ఇత్యాది భయానక వ్యాధులకు బలవుతారని నిర్ధారించారు.

## "గ్రుడ్లు ఎంతకాలం నిల్వ వుంటాయి?"

గ్రుడ్లు 12 గంటల కన్నా అధిక సమయం, 8 డిగ్రీల సెల్సియస్ కన్నా అధికమయిన తాపమానంలో నిల్వవుంచితే వాటి పెంకు లోపలి భాగం కుళ్ళిపోయే ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రయోగాలు సూచించాయి. ఇటువంటి పరిస్థితులలో అధిక వేడి కలిగిన భారతదేశంలో గ్రుడ్లు కోళ్ళ ఫారాల నుండి విక్రయ కేంద్రానికి తీసుకు రావడానికి సుమారు 24 గంటలు పడుతుంది. అందుచేత గ్రుడ్డును సేకరించిన వెంటనే రెఫ్రిజిరేటర్లలో ఉంచి అమ్మడమనేది సాధ్యం కాదు. అందువల్ల, కాలుష్య ప్రక్రియ అప్పటికే మొదలై కుళ్ళిపోవడం అనే ప్రక్రియ మొదలవుతుంది. అందువల్ల గ్రుడ్డులోని ద్రవ పదార్థం దాని పెంకు ద్వారా ఆవిరైపోవడం మొదలయి, ఆ తరువాత రోగకారక క్రిములు దాన్ని ఆక్రమించి గ్రుడ్డు యొక్క బాహ్య భాగాన్ని పెకిలించి దాన్ని పూర్తిగా కుళ్ళిపోయేలా చేస్తుంది. నిమిషాల వ్యవధిలో చెడిపోయిన ఇటువంటి గ్రుడ్లను సరిగ్గా పరీక్షించకుండా తినడం వల్ల అనేక వ్యాధులకు గురయ్యేఅవకాశం వుంది".

ఎవరైతే భగవంతుని మార్గంలో ప్రయాణించదలుచుకున్నారో వారికి చేపలు, మాంసము నిషిద్ధము.


## "కొలెస్టరాల్‌కు మూలాధారం గ్రుడ్లు"

గుండె సమస్యలు మరియు అధిక రక్తపోటుకు ముఖ్య కారణం ప్రేవుల లోపలి గోడలలోని రక్తనాళాలలో కొలెస్టరాల్ ప్రోగవడం. కొలెస్టరాల్‌కు మూలాధారం గ్రుడ్లు, ఆ తరువాత మాంసం, ఇంకా క్రొవ్వు పదార్థాలు. రోజుకు100గ్రాముల గ్రుడ్లు తింటే, శరీరానికి అవసరమయిన దానికంటే 2 1/2 రెట్లు అధికంగా కొలెస్టరాల్ చేరుతుంది.

ఇంకా మాంసం మరియు గ్రుడ్లు తినడం వల్ల విషతుల్య పదార్థాలతో పోరాడే శరీర సామర్థ్యం రక్త ప్రవాహంలో తగ్గుతుంది. చిన్న చిన్న వ్యాధుల నుండి సైతం రక్షించుకోలేని స్థితి ఏర్పడుతుంది. **అమెరికా మరియు బ్రిటీష్ వైద్యులు కొందరు గ్రుడ్లు మానవులకు విషంతో సమానమని వర్ణించారు.**

## ఏ గ్రుడ్లూ శాకాహారం కావు.

గ్రుడ్లు రెండు రకాలు - పొదుగు ద్వారా ప్లిలలు పుట్టే రకాలు, మరియు పొదుగు ద్వారా పిల్లలు పుట్టే అవకాశం లేని రకాలు. కోడి పెట్టలు పుంజులతో సంపర్కం లేకుండానే యౌవ్వన దశలో గ్రుడ్లు





పెట్టగలవు. ఈ గ్రుడ్లను స్త్రీలలో సంభవించే ఋతుచక్రంతో పోల్చవచ్చు. స్త్రీ ప్రతి మాసం బహిష్టు పదార్థాలను ఎలా విసర్జిస్తుందో, అలాగే కోడి పెట్టలు నియమితకాలంలో గ్రుడ్లు పెడతాయి. ఈగ్రుడ్లు కూడా కోడిపెట్టలు గర్భాశయం నుండి వెలువరించిన వ్యర్థ పదార్థమే.

ఈ గ్రుడ్ల ద్వారా మితిమీరిన డబ్బు సంపాదించాలన్న ధ్యేయంతో,

**ఏ చేయి కర్మలు ఆచరిస్తుందో ఆ చేయి ఫలితాలను అనుభవిస్తుంది.**

వ్యాపారస్థులు వాటిని శాకాహార గుడ్లు, అహింసా గ్రుడ్లు ఇత్యాది తప్పదారి పట్టించే పేర్లతో వర్ణిస్తున్నారు. రెండు రకాల గ్రుడ్లు కోడి పెట్టినవే కాకుండా, వాటి రసాయనిక మిశ్రమం కూడా ఒక్కటే. ఒకవేళ వర్గీకరించాలనుకుంటే అలాంటి గ్రుడ్లు అపక్వమయినవిగా, చనిపోయినవిగా లేక పుడుతూనే చనిపోయినవిగా పేర్కొనవచ్చు. ఏది ఏమయినా రెండు రకాల గ్రుడ్లూ హానికరమయిన గుణాలున్నవే.

వాణిజ్యపరంగా త్వరితలాభాల కోసం అధిక సంఖ్యలో గ్రుడ్లు పొందేందుకు కోళ్లను ఎంతటి ఘోర చిత్ర హింసలకు గురిచేస్తున్నారో చాలా మందికి తెలియదు. కోళ్ల పెంపకం వ్యాపారంలో అధికంగా లాభాలు



ఆర్జించేందుకు కోళ్లను ఎంత దుర్భర పరిస్థితులలో ఉంచుతున్నారో, ఎలాంటి క్రూరమయిన పద్ధతులు అవలంబిస్తున్నారో చూసేవాళ్లకు కాని తెలియదు. కోళ్ళు గ్రుడ్లు పెట్టేందుకు అనుసరించే నరకసదృశమయిన పద్ధతుల వల్ల, ఈ భయోత్పాతం, నరకయాతన గ్రుడ్లలో నిక్షిప్తమయి, వాటిని తినేవారి జీర్ణాశయంలోనే కాక రక్తంలో కూడా ప్రవేశిస్తాయి.

కోడిపెట్టలు పెట్టిన గ్రుడ్లు ప్రకృతి సహజంగా పెట్టినవి కావు. అలాగే తమ ఇచ్ఛానుసారంగా పెట్టినట్టివి కావు. ఇదిలా వుండగా, అవి నిరాఘాటంగా గ్రుడ్లు పెట్టేందుకు గాను వాటికి గ్రుడ్ల -సూత్రీకరణ కల హార్మోను మరియు ఇంజెక్షన్లు ఇస్తారు. గ్రుడ్లు బయటికి వచ్చిన మరుక్షణమే 'ఇన్‌క్యూబేటర్' (గ్రుడ్లు పెట్టేందుకు ఉపయోగించే సాధనం)లో ఉంచి 21 రోజుల ప్రకృతి సహజ పద్ధతికి భిన్నంగా 18రోజులలోపే

**ఏ జీవులనైతే మనం చంపి తింటామో, వాటివల్ల మన శరీరం నుండి ఒక ప్రత్యేకమైన దుర్గంధము వస్తుంది. ఆ జంతువులు మనల్ని చూడగానే భయపడి మన నుండి దూరంగా పారిపోతాయి.**

కోడిపిల్లలు పొదుగునుంచి బయటికి వచ్చేట్టు చేస్తారు.

గ్రుడ్డు నుంచి కోడిపిల్ల బయటపడగానే మగ మరియు ఆడ పిల్లలను విడదీసి ఆడ కోడిపిల్లలు త్వరితగతిన పెరిగేందుకుగాను ప్రత్యేక రకమయిన వాతావరణంలో మేపుతూ, వాటిని పగలూ- రాత్రి కృత్రిమంగా అధిక వెలుగునిచ్చే విద్యుద్దీపాల కాంతిలో మేల్కొని వుండేట్టుగా ఉంచుతారు. అవి అధికాధికంగా తింటూ వీలయినంత త్వరగా గ్రుడ్లు పెట్టేందుకు ఇలా చేస్తారు. ఇప్పుడు వాటిని ప్రకృతి సిద్ధమయిన భూమి మీద కాక చిన్న చిన్న పంజరాలలో ఉంచుతారు. ఆ పంజరాలలో అవి కనీసం రెక్కలు ఆడించే అవకాశం కూడా ఉండదు. అవి ఒకదానికొకటి పొడుచుకుని గాయాలపాలై, కోపతప్తమై, చిత్రహింసలతో బాధపడతాయి.

గ్రుడ్లు విసర్జించగానే వాలుగా ఏర్పరిచిన వలలోకి జారిపోగా, గ్రుడ్లను పొదగాలన్న వాటి బలీయమైన కోరిక నెరవేరదు. ఇలా ఎందుకు చేస్తారంటే, కోడిపెట్ట గ్రుడ్ల మీద కూర్చోకుండా ఉన్నట్లయితే త్వరితగతిన మరో గ్రుడ్డు పెడుతుందన్న ఉద్ధేశ్యంతోనే ఈ విధంగా వాటిని జీవితకాలమంతా పంజరాలకే బలి చేస్తారు. శారీరక వ్యాయామం కొరత వల్ల, వాటి అవయవాలు చైతన్య రహితమవుతాయి. ప్రకృతి నిర్ధేశించిన దానికి విరుద్ధంగా మరిన్ని ఎక్కువ గ్రుడ్లు రాబట్టుకునేందుకు వాటికి ఎండు చేపలు కలిపిన ప్రత్యేక దాణాతో మేపుతారు. గ్రుడ్లు పెట్టే సామర్థ్యం క్షీణించి పోగానే వాటిని జంతువధశాలకు నెట్టి వేస్తారు.ఈ విధంగా సేకరించిన గ్రుడ్లను శాకాహారమని ఎలా అనగలం?

అథర్వణ వేదంలో (8.6.23), మాంసం మరియు గ్రుడ్డు నుండి వెలువడిన జీవిని తినడం నిషిద్ధమంటూ ఈ క్రింది పదాల రూపంలో పేర్కొనడం జరిగింది.

'యె అమ్మామ్ మాస్ మదంతి పౌరుషేయం చె యె కవి గౌర్వాన్ ఖదాంతి కేశ్వస్తంలో నాష్యామ్సి'

అంటే ఎవరు పచ్చి లేక ఉడకబెట్టిన మాంసం తింటారో, మరియు ఎవరు గ్రుడ్డు అంతర్భాగంలో నున్న జీవిని విచ్ఛిన్నం చేస్తారో వారు కూడా విచ్ఛిత్తిగావింపబడతారు అని అర్థం.

**జీవులను బలవంతంగా చంపి తినేవారు భగవంతుని దగ్గర కర్మల లెక్కలు అప్పగించవలసి వస్తుంది.**

# వివిధ మతాలు మాంసాహార భోజనాన్ని నిషేధించాయి

ప్రపంచంలోని అన్ని గ్రంధాలు ప్రతి జీవిలోను భగవంతుని ప్రతిరూపాన్ని వీక్షించమనీ, అహింస పరమోత్తమమైనదని ఉద్బోధించాయి. సర్వమతాలు అమాయక జీవులకు హాని కలిగించడం మరియు చంపడం లాంటివినిషేధించాయి. కొందరు తమ జిహ్వారుచిని సంతృప్తి




పరచుకోవడం కోసం, వారి స్వార్థపూరితమయిన కోరికల కోసం తమ మతం మాంసం తినడాన్ని నిషేధించలేదని చెప్పడానికి ప్రయత్నిస్తారు. కాని, ఇది అసత్యం.




**"ఎవరైతే సంతోషంగా ఉండాలని అభిలషిస్తారో, వారు ఇతరుల్ని, ఇతర జీవుల్ని కూడా సంతోషంగా ఉండనివ్వడం నేర్చుకోవాలి". లేని యెడల ప్రకృతి తనదైన విచిత్రశైలిలో శిక్షిస్తుంది.**

**పరమాత్మ అందరిలో వున్నాడంటూ జంతువులను ఎలా చంపుతారు?**

# "హిందూమతం"



శ్లో॥ ఆత్మౌపమ్యేన సర్వత్ర పశ్యతి యోఽర్జున।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః॥
(భ.గీ. 6-32)

తా॥ "ఓ అర్జునా! ఎవడు సమస్త భూతములు యొక్క సుఖ దుఃఖాలు, తన సుఖ దుఃఖాలుగా చూస్తాడో అట్టివాడు అందరిలో నాకు ఎక్కువ ప్రియుడు. ఇది నా నిశ్చితాభిప్రాయం.

సమస్త హైందవ ధార్మిక గ్రంధాలు - ప్రతి జీవి భగవంతుని అంశమనీ, అహింస, కరుణ, ప్రేమ మరియు క్షమ ఇత్యాది సద్గుణాల ఆవశ్యకతను నిర్ధేశిస్తున్నాయి. మాంసం తినడం పాపభూయిష్టమైనది గాను మరియు ఆత్మను పతనావస్థకు చేర్చేదిగాను వర్ణించాయి.

## శ్రీ మద్భగవద్గీత మూడు విధాలయిన ఆహారం నిర్ధేశిస్తుంది

**1) సాత్విక ఆహారం :** పళ్ళు, కాయగూరలు, మొక్క ధాన్యాలు, కాయ ధాన్యాలు, కాయలు, పాలు, వెన్న లాంటివి సాత్విక ఆహారాలు. ఇవి జీవిత కాలాన్ని, వివేకాన్ని మరియు శక్తిని ఇవ్వటంలో తోడ్పడతాయి. ఇంకా ఆనందాన్ని, మనశ్శాంతిని, కరుణని, అహింసని మరియు మనోబలాన్నిచ్చి, శరీరాన్ని, హృదయాన్ని మరియు మనసుని అన్ని కలుషితాల్నుంచి కాపాడుతాయి.

**2) రాజసిక ఆహారం :** అధిక వేడిమి, పులుపు, కారం , మసాలా మరియు ఎండు పదార్ధాలు రాజసిక ఆహారాలు దుష్టభావాలను, దుఃఖాన్ని, వ్యధలను మరియు ఆందోళనలను కలుగచేస్తాయి.

**3) తామసిక ఆహారం :** పాసిపోయిన, రస విహీనమయిన, సగం ఉడికి, ఉడకని, దుర్వాసన పూరితమయిన, కుళ్ళిపోయిన, కలుషితమయిన, ఆహారాలు. అవే కాక మత్తుపదార్ధాలు మరియు మాంసం లాంటివన్నీ తామసిక ఆహారాలు. ఇవి మనిషిని దుష్కృత్యాలకు పురిగొల్పి, వారి వివేకాన్ని నిర్వీర్యం చేసి, వ్యాధులను కలుగ చేస్తుంది. సోమరితనాన్ని మరియు దుష్ప్రవర్తనను కలగ చేస్తాయి.

గ్రంధాలలో నిర్వచించిన పునర్జన్మ సిద్ధాంతం ప్రకారం 84లక్షల ఇతర జన్మల పిదప ఓ జీవి మానవరూపంలో ఉద్భవిస్తుంది. అంటే "ఒక


**ఎలాంటి విత్తో అలాంటి పంట కోస్తాము. హింస చేస్తే హింసే పొందుతాము**

జీవి యొక్క మాంసాన్ని తినడమంటే మన బంధువర్గంలోని ఒకరి మాంసాన్ని తినడమే" అవుతుంది.

## భీష్మాచార్యుడు

మహాభారతంలో భీష్మపితామహుడు, మాంసం తినేవారు, మాంసాన్ని విక్రయించేవారు, మరియు మాంసం కోసం జంతువులను వధించేవారు పాపాత్ములని అభివర్ణించారు. ఎవరు మాంసం తిని, తమ శరీర మాంసాన్ని అధికం చేసుకోవలన్న కోరిక కలిగుంటారో, వారు ఎప్పటికీ ప్రశాంతంగా జీవించలేరని ఆయన చెప్పారు.


## వీరబ్రహ్మేంద్రస్వామి



**"జీవులను వధించి జీవికి వేసినా**
**జీవ దోషములను జిక్కువడును;**
**జీవహింస చేత చిక్కునా మోక్షంబు!**
**కాళికాంబ! హంస! కాళికాంబ !"**

తా:- ఒక ప్రాణిని చంపి ఇంకొక ప్రాణికి పెడితే పాపాల్లో చిక్కుకుంటారు. అంతే తప్ప అలా జీవులను (జంతువులను, పక్షులను, చేపలను) హింసించి, భక్షించేవారికి మోక్షం అంటే ముక్తి (రోగాలు, కష్టాలు, బాధలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యల నుండి ముక్తి) లభిస్తుందా? అని వీరబ్రహ్మేంద్ర స్వామి వారు తెలియచేస్తున్నారు.

## స్వామి నిర్మలానందగిరి




మానవులు ఆధ్యాత్మికంగా ఉన్నత లోకాలకు ఎదగాలంటే అహింసను పాటించవలసిందే.

మాంసం తినే జంతువులను మానవుడు క్రూర జంతువు అని పిలుస్తాడు. కానీ ఏ క్రూర జంతువు కూడా మాంసం తినే మానవుడి కంటే క్రూరమైనవి కాదు.

మానవుని కోసం ఆ జంతువులే కనుక సృష్టించబడి వుంటే, వాటిని చంపడానికి మానవుడు ఆయుధాలు ఎందుకు ఉపయోగిస్తున్నాడు? కానీ చాలా జంతువులు ఏ ఆయుధాలు లేకుండా మనిషిని చంపగలవు. అటువంటప్పుడు మనిషే జంతువుల కోసం సృష్టించబడ్డాడని ఎందుకు అనుకోకూడదు?

**మంచి చేస్తే చెడు లభించదు. చెడు చేస్తే మంచి లభించదు.**

# "ఇస్లాం మతం"



"లన్-యనా-లల్లాహ్ - లుహూ ముహో - వలా - దిమా - ఉహో - వలాకిన్ - యనా - లు - హుత్ - తఖ్ వా మిన్‌కుమ్ కజాలిక - సఖ్ఖరహో - లకుమ్ - లితు కబ్బిరుల్లాహ - అలమా - హదా - కుమ్ - వ - బష్‌పరిల్ - ముహ్ - సినీన్"

తా:- జంతువుల మాంసం కానీ వాని నెత్తురు కానీ దేవునికి చేరవు (స్వీకరించడు అంటే ఇష్టపడడు) ఆయన పట్ల మీ భక్తియే చేరుతుంది (స్వీకరిస్తాడు అంటే కోరుకుంటాడు)

(సూరెయెహజ్ - 22, ఆయత్-37))

ఇస్లాం యొక్క సమస్త సూఫీ భక్త శిఖామణులు, సద్గుణ వంతులుగా జీవించడం, త్యాగ నిరతితో మరియు కరుణాంత రంగంతో జీవించడం, సాధారణ ఆహారం భుజించడం మరియు మాంసం త్యజించడం ప్రముఖంగా పేర్కొన్నారు. వారు స్వయంగా మాంసాన్ని త్యజించారు. షేక్ ఇస్మాయిల్, ఖ్వాజా మెయినుద్దీన్ ఛిస్తీ, హజ్రత్ నిజాముద్దీన్ ఔలియా, బు అలీ ఖలందర్, షా ఇనాయత్, మీర్ దాద్, షా అబ్దుల్ కరీం మున్నగు సూఫీ భక్త శిఖామణులు ధర్మబద్ధంగా జీవించటం, సకల జనులపై ప్రేమ మరియు ఆదరణ, మరియు శాకాహారం గురించి చెప్పారు.

"త బయాబిన్ డర్ బహిష్తే అదెన్ జా, షఫ్కతె బనుమయెబ ఖల్‌కె ఖుదా" అని వారు చెప్పారు. అంటే రాబోయే సర్వకాలాల్లోనూ నువ్వు స్వర్గంలో నివసించాలనుకుంటే భగవంతుడు సృష్టించిన సమస్త జీవరాసుల తో దయాస్వరూపుడవై, సానుభూతిపరుడవై ప్రవర్తించు అన్నదే దీని సారాంశం.

సుప్రసిద్ధ భక్త శిఖామణి మీర్‌దాదాగారు :

"ఎవరు కానీ ఏ జీవరాశికి చెందిన మాంసం తిన్నా అందుకు ప్రతిఫలంగా తన మాంసాన్ని ఇవ్వవలసి వస్తుంది". "ఎవడు మరొక జీవి ఎముకల్ని విరిచేస్తాడో వాడి ఎముకలు కూడా వ్రక్కలవుతాయి". "మరొక జీవి నుండి చిందించిన ప్రతి రక్తపు బొట్టు తన స్వంత రక్తపు బొట్టుతో లెక్కగట్టవలసి వస్తుంది". ఎందుకంటే అది తిరుగులేని "న్యాయసూత్రం" అని చెప్పారు.

**రక్తపాతం కాబట్టే మాంసం తినడం నిషిద్ధం.**

## కబీర్ ముస్లిములనుద్దేశించి ప్రసంగిస్తూ...

"ఉపవాసాన్ని (రోజా) పాటించే ఉపాసకుడు మాంసం రుచిని ఆస్వాదించేందుకు, జీవుల్ని వధిస్తే, అతని ఉపవాస వ్రతం నిష్ప్రయోజన మవుతుందని స్పష్టీకరించారు" అల్లా ఈ ప్రవర్తనను అంగీకరించడన్నారు.

## లండన్ మసీదు ఇమామ్ అల్ - హాఫిజ్ బి.ఎ. మాస్రి :

తన పుస్తకం 'జంతువులపై ఇస్లాము యొక్క చింతన' లో మతం పేరుతో జంతువులపై అత్యాచారాన్ని గురించి దుఃఖాన్ని వ్యక్తం చేశారు. పవిత్రమయిన ఖురాన్ మజీద్ మరియు పవిత్ర ప్రవక్త మహమ్మద్ లను ఉటంకిస్తూ, జంతువులను యాతనకు గురిచేసే అన్ని చర్యలు, మరియు పక్షుల్ని పంజరాలలో బంధించడం సైతం పాపమేనని ఆయన వర్ణించారు. ఆయన అభిప్రాయాన్ననుసరించి చెట్లను నరకడం కూడా ఇస్లాం




నిషేధించింది. వారు ఇమామ్ సాహెబ్ పుస్తకంలోని 18వ పుటలో పవిత్ర ప్రవక్త ముహమ్మద్ ప్రవచనాలను ఇలా పునరుద్ఘాటించారు.

తనకు తాను అర్హత కలిగియుండని పిచ్చుకను లేక ఏ చిన్న జీవినైనను చంపనివాడు ఎవడూ ఉండడు. అయితే భగవంతుడు దీనిగురించి అతడిని ప్రశ్నిస్తాడు.

"ఎవడు పిచ్చుకపై సానుభూతి చూపి దాన్ని చంపకుండా విడిచి పెడతాడో, తీర్పు ప్రకటించే రోజున అల్లా వాడి మీద దయ చూపుతాడు".

ఇమామ్ మాస్రి తాను స్వతహాగా శాకాహారిగా ఉండి ప్రతి ఒక్కరు శాకాహారులు కావాలని సలహా ఇచ్చారు.

**మానవుల ప్రవర్తన చాలా విచిత్రంగా వుంటుంది. ఒకవైపు నోటితో మతగ్రంథాలు పారాయణ చేస్తారు. మరోవైపు అదే నోటితో జీవుల రక్తమాంసాలు తింటారు.**

# ముస్లింలనుద్దేశించి కొందరి మహాత్ముల అభిప్రాయాలు:-

## గరీబ్ దాస్‌జీ

ముల్లా, ఎందుకు అరుస్తూ 'బాంగ్' ఇస్తావు అల్లాకు చెముడు లేదు ముప్పై రోజులు రోజా(ఉపవాసం) ఉండి చంపి మాంసాన్ని తింటావు, మరి ఖుదా దర్శనం నీకు ఎలా కలుగుతుంది? అసలు విస్మరించి ఘోర పాపాలను మూట కట్టుకుంటావు? ఈ విధంగా నీవు భవజలధిలో మునిగిపోతావు.

## వాజిద్‌జీ

ఆవు, మేక, కోడి, చేప అన్నింటిలోను రక్తం ఒకే రకంగానే వుంటుంది, ప్రాణం అందరికీ తీపిగానే వుంటుంది. ఒక మేక పరమాత్మ దర్బారులో న్యాయం కోసం చేసే ఫిర్యాదును ఈ విధంగా వర్ణించారు.

"ఓ ప్రభూ! కాజీ నా శిరస్సు ఖండించాడు. అతడి శిరస్సు కూడా ఖండించండి, పేదలకు, ధనికులకు ఒకే రకంగా న్యాయం చేయండి" అని మేక పరమాత్మతో విన్నవించుకుంటుంది.

## పలటూ సాహెబ్

ఇస్లాం మతానికి చెందిన అసలైన సందేశాలను పరిశీలిస్తే జీవులన్నింటిలోనూ ఒకేలాగ ప్రాణం వున్నదనీ, అందరిలోనూ ఆ ఒక్క పరమాత్ముడే కనిపిస్తున్నాడనీ, మరొకరు లేరని తెలుస్తుంది.

ఓ మోల్వీ! నీకు జిహ్వా చాపల్యం శోభించదు ఎందుకంటే జంతువుల మాంసంలో వాటి రక్తం కలిసి వుంటుంది. నీవు జీవుల ఆత్మకు దుఃఖాన్ని కలిగించే పాపాన్ని ఎందుకు చేస్తావు? అందరిలో ఆ ఒక్క పరమాత్ముడి ప్రకాశమే ఉన్నదనే సంగతి గుర్తుంచుకో. నీవు పెద్దల హజరత్ మహమ్మద్ సాహెబ్ ఆజ్ఞానుసారంగా నడచుకోవడం లేదు. "నిర్దయుడే నిజమైన మతభ్రష్టుడు, నాస్తికుడు, నీచుడు".



## దరియాసాహెబ్

జీవ హత్య చేసేవాడు ఖురాన్ శరీఫ్ మొత్తాన్ని కంఠస్తం చేసినా ఎంతగా విద్వాంసులమని చెప్పకున్నా, నిజానికి వారి హృదయాలు జీవుల మాంసం తినడం వల్ల మలినమైపోయాయి.


పరమాత్మ దర్బారులో పండితుల, మోల్వీల, శుష్క జ్ఞానము చూడబడదు. అక్కడ " జైసీ కర్ వైసీ భర్‌నీ"

**మాంసమే గనుక మహా ప్రసాదమైతే ఆలయాలలో ఖచ్చితంగా నివేదనలు చేసేవారు**

అంటే ఎలాంటి కర్మలో అలాంటి ఫలితాలు అనే విధానము వుంది. "ఖూన్ బద్‌లే ఖూన్" అంటే రక్తానికి రక్తం అనే నియమం పనిచేస్తుంది.

రాత్రింబవలు మహమ్మదీయులు ఖురాన్, హిందువులు గీతాపారాయణం చేసినా కూడా తమ లోపల జీవులపై దయ నామమాత్రం కూడా లేనివారు పరమాత్మ యొక్క నిజమైన భక్తులు కారు.

మాంసం, చేపలు తింటూ మత్తుపదార్థాలను సేవించే చండాలురు ఎదురు దెబ్బలు తింటూ నరకాన్ని అనుభవిస్తారు



**కబీర్ సాహెబ్**

కోడి ముల్లాతో అంటుంది. నీవు నిర్ధాక్షిణ్యంగా నన్ను చంపుతున్నావు. ఖుదా లెక్కలు అడిగినపుడు నీవు సంకటములో పడతావు. పగలు రోజా(ఉపవాసం) ఉంటారు. రాత్రి ఆవును చంపుతారు. ఆ భక్తి, ఈ హత్య, ఇలా చేస్తే పరమాత్మ ఎలా ప్రసన్నుడవుతాడు?


మానవుల్లారా! పదే పదే చెపుతున్నాను ఆలకించండి దేని గొంతుకోస్తు న్నావో అది నీ గొంతును కోస్తుంది. హిందువులకు దయలేదు. తురకలకు దాక్షిణ్యము లేదు. ఇరువురూ చౌరాసీ వలయంలో పడి తిరుగుతారు.

ముస్లిములు జీవ హత్య చేసేటపుడు కల్మా చదవడం వలన మాంసం 'హలాల్' (తినటానికి యోగ్యమైనది) అవుతుందని తలుస్తారు. జంతువును చంపేటపుడు దాని నుండి చైతన్యాత్మ వెళ్ళిపోతుంది. ఇక మట్టితో చేసిన శరీరం మిగిలిపోతుంది. ఆత్మ లేని మృత శరీరం 'హలాల్' అనగా తినయోగ్యమైనది ఎలా అవుతుంది? ఇలాంటి కపటులు బయటకు ధర్మాత్ములుగా నటిస్తూ ప్రతిరోజూ మసీదులలో తలవంచి మ్రొక్కినా, పదే పదే మక్కాకు హజ్ యాత్ర చేస్తున్నా, వారి నీచ ప్రవృత్తి నశించదు. ఇలాంటి మలినాత్ములకు ఎన్నటికీ కూడా సత్య జ్ఞానం ప్రాప్తించదు. ఇలాంటి హింసకులు, కపటులు, మరియు అజ్ఞానులైనవారు స్వర్గమార్గాన్ని కోల్పోయి నరకానికి వెళతారు.

జీవులను హత్యచేసి వాటి రూపాన్ని 'హలాల్' (తినటానికి యోగ్యమైనది) అని అనేవారికి పరమాత్మ దర్బారులో వారు చేసిన కర్మలకు లెక్కలు అడగబడినపుడు తమ మూర్ఖత్వం గురించి తెలిసి వస్తుందని కబీర్‌సాహెబ్ అన్నారు.

**ఇతర జీవులపై దయ చూపని వాడిపై పరమేశ్వరుడు కూడా దయచూపడు.**

# "క్రైస్తవ మతం"



"And the flesh of slain beasts in his body will become his own tomb. For I tell you truly, he who kills, kills him self, and who so eats the flesh of slain beasts, eats the body of death".

**- Jesus Christ**

"చంపబడిన జంతువుల మాంసం శరీరం లో ఉంటే ఆ శరీరం సమాధిలాంటిది. ఎవరైతే చంపుతారో వారు నిజానికి తమనే చంపుకుంటున్నారు. చంపబడిన వాటి మాంసం తినేవారు మృత శరీరాలను తింటున్నట్లే.

**- జీసస్ క్రైస్ట్**

ఏసుక్రీస్తుకు ఆధ్యాత్మిక జ్ఞానము 'జాన్ ది బాపిస్టు' నుండి ప్రాప్తించినది.ఆయన మాంసం తినడాన్ని వ్యతిరేకించే 'ఎస్సీన్' శాఖకు చెందినవారు. 'జాన్ ది బాపిష్టు' కూడా మాంసాహారానికి తీవ్ర వ్యతిరేకి.

ఏసుక్రీస్తు బోధల్లో ముఖ్యమైన రెండు విషయాలు

1) "నీవు చంపకూడదు"

2) "నిన్ను నువ్వు ప్రేమించుకున్నట్టు ప్రక్కవారిని ప్రేమించు".

వీటిని బాగా విచారిస్తే ఏసుక్రీస్తు మాంసం తినడానికి అనుమతి ఇచ్చారని భావించగలమా?

అదే కాకుండా 'డెడ్ సీస్క్రాల్స్' యొక్క నూతన పరిశోధన మరియు ఆరామైక్ భాష లేదా స్లావ్ భాషలో, ఆ సమయంలో ఏసుక్రీస్తు ఇచ్చిన అసలు బోధనలకు అనువాదం ద్వారా ఏసుక్రీస్తు మాంసాహారానికి ఎంత ప్రబల వ్యతిరేకో స్పష్టంగా తెలుస్తుంది. ఎడ్మండ్ జకై ప్రచురించిన 'గాస్పెల్ ఆఫ్ పీస్ ఆఫ్ జీసస్ క్రైస్ట్' అనే పుస్తకంలో ఏసుక్రీస్తు వచనాలను ఈ విధంగా వ్రాశారు.

"నేను మీతో నిజము చెపుతున్నాను. ఇతరులను చంపేవాడు తనను తాను చంపుకుంటాడు. ఎవడైతే జిబహ్ చేసిన (చంపిన)

**ఇతరులకు దుఃఖాన్ని కలిగించేవాడు తాను కూడా సుఖంగా ఉండలేడు.**

జంతువుల మాంసాన్ని తింటాడో, వాడు మృత్యువును తింటాడు, ఎందుకంటే వాడి శరీరంలో ఆ జంతువుల రక్తము యొక్క ప్రతి చుక్కా విషంగా మారుతుంది. వాని శ్వాసలో మృత పశువుల శ్వాసల దుర్గంధముంటుంది. వాని రక్తము మృత పశువుల రక్తంలానే పొంగుతుంది... మరియు పశువుల మరణం వాని మరణం అవుతుంది".

ఈ బైబిల్ ఏసుప్రభువు 'ఆరామైక్' భాషలో చెప్పబడిన మూలవచనాల అసలైన అనువాదమని చెప్పబడుతుంది. ఈ పురాతనమైన చేతి వ్రాత దస్తావేజు వాటికన్ గ్రంథాలయంలో ఉంది. దానిలో వ్రాయబడి వున్న విషయం.

కొందరు జిజ్ఞాసులు ఏసుప్రభువును "ఓ దైవదూతా! మీ వద్ద అమర జీవనపు రహస్యము ఉన్నది. మేము తిరిగి ఎన్నడు దుఃఖాల నెదుర్కొనకుండా ఉండేందుకుగాను ఎలాంటి పాపాల నుండి జాగ్రత్త పడాలో మాకు చెప్పండి?" అని ప్రశ్నించారు.

దానికి ఏసుప్రభువు "అసలు విషయం ఏమంటే? ఎవరైతే చంపుతారో వారు నిజానికి తమను తామే చంపుకుంటున్నారు. ఎవరైతే చంపబడిన జంతు మాంసాన్ని తింటారో వారు నిజానికి తమ మృత మాంసాన్ని తింటున్నారు. జంతువుల మృత్యువు వారి స్వీయ మృత్యువు. ఎందుకంటే ఈ పాపానికి ఫలితం (శిక్ష) మరణం కంటే తక్కువగా వుండజాలదు" అని చెప్పారు.

"మూగ జీవులను చంపకు. అలా చంపిన అమాయక జీవి మాంసాన్ని తినకు. లేకుంటే నీవు సైతాన్‌కు బానిస అవగలవు. ఎందుకంటే అది దుఃఖంతో కూడిన మార్గం. అది మృత్యువు వైపుకు తీసుకు వెళ్తుంది. పరమాత్మ ఆజ్ఞలో జీవించు, అలా జీవిస్తే ఆయన దూతలు జీవితపు మార్గంలో నీకు సహాయం చేస్తారు. అందువలన పరమాత్మ యొక్క ఈ ఆదేశాన్ని పాటించు. చూడు నేను నీకు భూమిపైన అనేక రకాల ఫలాలను, ధాన్యాలను ఇచ్చాను. ఫలాలు కాచే అనేక వృక్షాలను ఇచ్చాను. ఇవి నీకు మాంసానికి బదులుగా ఇవ్వబడ్డాయి. రక్తమాంసాలతో వున్న వాటిని నీవెన్నడూ తినకు (The Gospal of peace, Jesus p.48.49).

ఆయన మళ్ళీ ఇలా అన్నారు. శాకాహారం నీకు జీవితాన్ని మరియు శక్తినిస్తుంది. అయితే "నీవు చచ్చిన ఆహారం (మాంసం) తింటే నీ ఆహారం నిన్ను చంపుతుంది", ఎందుకంటే "జీవితం జీవితాన్ని ఇస్తుంది" మరియు

**మాంసం తింటే మానవుడు కఠోర చిత్తం కలవాడై దుర్మార్గపు పనులు చేస్తాడు, చేయిస్తాడు.**

"చావు ఎప్పుడూ చావునే ఇస్తుంది" కనుక.

ఏసుప్రభువుకు సన్నిహిత శిష్యుడైన సెయింట్ మాథ్యూ మాంసాహారాన్ని ఆధ్యాత్మిక పతనానికి సూచనగా భావించేవారు. వారు మాంసం తినేవారు కాదు. ధాన్యం, ఫలాలు, కూరలు ఆహారంగా తీసుకొనేవారు.

సెయింట్ మాథ్యూ మరియు సెయింట్‌పాల్ మాంసం తినడమనేది మతాన్ని నీచస్థాయికి తీసుకుపోవడమేనని భావించారు. క్రైస్తవ మతంలో ఒక తెగవారు (Methodists) మరియు ఏడవరోజు ఆగమ-అనాగమాల మీద ఆధారపడ్డ వారు (Seventh Day Adventists) మాంసాన్ని తినడం మరియు మత్తు పానీయాల్ని త్రాగడం ఖచ్చితంగా నిషేధించారు. టాల్‌స్టాయ్ మరియు డుఖోబార్ (Dukhobar) రష్యాకు చెందిన ప్రామాణిక క్రైస్తవ మతస్థుడు (Orthodox Russian christian) మాంసం తినడం క్రైస్తవ మతసిద్ధాంతాలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ప్రారంభంలో అనేకమంది క్రైస్తవ ఫాదర్‌లు మాంసం తినడానికి వ్యతిరేకించేవారు ఎందుకంటే క్రైస్తవ మతం ప్రతీ ప్రాణిపై దయ చూపాలని ఉపదేశించింది. - (ది ఎసీన్ గాస్పెల్ ఆఫ్ పీస్ పు 44 నుండి 46)

## క్రైస్తవ మతంలోని కొన్ని ఉపదేశాలు

"కత్తి పట్టుకొను వారందరూ కత్తి చేతనే నశింతురు".

(సెయింట్ మాథ్యూ 26:52)

"నా కుమారుడా ! నీవు విని తెలుసుకుని బుద్ధిమంతుడవ్వు. నీ హృదయమును తిన్నని మార్గమున ఉంచు. మద్యము త్రాగువారితోను, దురాశతో మాంసము తినువారితోను సహవాసము చేయకు. ఎందుకనగా త్రాగుబోతులు మరియు తిండిపోతులు దరిద్రులగుదురు".

(ప్రోవెర్బ్స్ 23:19-20-21)

"జనులారా! కోడెలను, గొర్రెలను, మేకలను చంపడం నాకిష్టం లేదు. ఇక మీద అసత్యపు నైవేద్యాలను తేకండి! అలాంటి వారి ప్రార్థన నేను వినను. మీ చేతులు రక్తముతో నిండియున్నవి. మీరు మిమ్ములను కడుక్కొని శుద్ధి చేసుకొనండి. దుష్కర్మలు, కీడు చేయుట మానండి. నా మాట విన్న యెడల భూమి యొక్క ఉత్తమ పదార్థములు అనుభవింతురు. సమ్మతింపక తిరుగబడిన యెడల మీరు ఖడ్గము పాలగుదురు". (యసయాహ్ అ; 1:10:30)

నేటి మేక రేపు కసాయివాడుగా అవ్వవచ్చు. నేడు కసాయివాడుగా ఉన్నవాడు రేపు మేకగా అవ్వవచ్చు.

"ఏ కారణం లేకుండా ఎవరైనా జంతువును చంపితే అంటే ఆ జంతువు అతనిపై దాడి చేయనపుడు గానీ, వేటాడే సరదాకోసం గాని లేదా దాని మాంసం తినేందుకు గాని లేదా దాని చర్మం కోసం గాని లేదా దాని దంతాల కోసం గాని జంతువును చంపితే ఆ పని పాపంతో నిండినది. అతడి అంతం కూడా జంతువు అంతంలానే వుంటుంది"

(ఎసీన్ గాస్పెల్ ఆఫ్‌పీస్, పు.44-46)

"మృత భోజనము నీ శరీరాన్ని కూడా మృతం చేస్తుంది. నీ శరీరాన్ని చంపే పదార్థాలు నీ ఆత్మను కూడా చంపుతాయి. నీ భోజనాన్ని బట్టి నీ శరీరముంటుంది. అదే విధంగా నీ ఆలోచనలు బట్టి నీ ఆత్మ వుంటుంది"

(ది వెజిటబుల్ ఫ్యాషన్ - పు.64)

లియోనార్డో-డా-విన్సీ పంజరంలో బంధించబడిన పక్షులను గమనించి వాటిని స్వేచ్ఛగా వదిలేవారు. మనిషి స్వతంత్రం కావాలని కోరేటప్పుడు పక్షులనూ, జంతువులనూ పంజరాలలో బంధించడ మెందుకు అనేవారు.

ప్రపంచ చరిత్ర తిరగేస్తే సమస్త ప్రపంచ విద్యావేత్తలు, తత్త్వవేత్తలు, శాస్త్రవేత్తలు, కళాకారులు, కవులు, రచయితలు మరియు మతనాయకుల యిన పైథాగరస్, ప్లుటార్కు, న్యూటన్, లియోనార్డో- డా-విన్సీ, డా.అని బెసెంట్, అల్బర్ట్ అయిన్‌స్టీన్, రెవరెండ్ డా.వాల్టర్ వాల్ష్, జార్జ్ బెర్నార్డ్ షా, టాల్‌స్టాయ్, కవులయిన మిల్టన్, పోప్, షెల్లీ, గ్రీకు తత్త్వవేత్తలయిన సోక్రటీస్ మరియు అరిస్టాటిల్ వీరందరూ స్వచ్ఛమయిన శాకాహారులని మనకు తెలుస్తుంది. శాకాహారం ద్వారా వారు వారి మనసుల్ని వికసింపచేసుకోవడమే కాదు. సహనం, దయ, ప్రేమ మరియు అహింస లాంటి గర్వించదగ్గ స్వభావాలను కూడా వారు పొందగలిగారు.

# జైన మతం

## "జీవించు - జీవించనివ్వు"



వర్ధమాన మహావీరుడు

జైన మతంలో అయిదు మహావ్రతాల్లో మొదటిది, అత్యంత ఆవశ్యక మైన మహావ్రతము 'అహింస'. ఏ జీవికి ఏ రకమైన దుఃఖాన్ని, కష్టాన్ని కలిగించ కుండటము, వాటిపై దయా, ప్రేమా చూపడమన్నది ముఖ్యమైన వ్రతంగా భావిస్తారు. వారు దీనినే 'మహావ్రతం' అంటారు.


జైన మతం ప్రకారం జంతువుల ను బంధించడం దుఃఖాన్ని కలిగించడం, కొట్టడం, వాటిపైన అధిక బరువు వేయడం కూడా మహాపాపంగా పరిగణించబడుతుంది.

**జాలి గుండె, సానుభూతి లేని వారు, ఇతరుల బాధనెలా అర్థం చేసుకోగలరు.**

# బౌద్ధమతం

## అహింసా పరమోధర్మః

### (అహింసే అన్ని ధర్మాల కంటే ఉత్తమమైన ధర్మం)




**బుద్ధుని జీవితంలో అహింసకు సంబంధించిన ఒక ప్రసిద్ధ కథ.**

రాజైన బింబిసారుడు ముక్తి కోసం వెయ్యి పశువులను బలి ఇవ్వబోతున్నాడు. ఆయన ఆజ్ఞ ప్రకారం పశువుల కాపరులు ఎన్నో పశువులను నగరం వైపుకు తోలుకు వస్తున్నారు. తీవ్రమైన ఎండలో, దెబ్బలు తింటూ పశువులు గాబరాతో పరుగులు తీస్తున్నాయి.

పశువుల బాధామయ దృశ్యాన్ని చూసి బుద్ధుని కోమల హృదయం ద్రవించిపోయింది. ఆయన వారితో "సోదరులారా! ఈ పశువులను ఎక్కడికి తోలుకెళుతున్నారు?

"మహారాజు బింబిసారుడి యజ్ఞశాలలో వీటిని బలి ఇవ్వ బోతున్నారు" అని పశువుల కాపరులు క్లుప్తంగా జవాబిచ్చారు.

బుద్ధభగవానుని కళ్లలో నీళ్ళు తిరిగాయి. వారు కూడా వాటితో పాటు నడిచి యజ్ఞశాలకు చేరుకున్నారు. యజ్ఞము ప్రారంభమైంది. ఒక పశువు పై పదునైన కత్తిని ఉంచి, "ఓ దేవతలారా! మీరందరూ వచ్చి ఈ పశువును స్వీకరించండి. ఇది రాజా బింబిసారుడి కోసం బలి ఇవ్వబడుతుంది" అని మంత్రం చదువబడింది.

ఇది విన్న బుద్ధభగవానుడి హృదయం కరిగిపోయింది. "రాజా! కొంచెము ఆలోచించు, ప్రాణాలను ఎవరైనా తీయగలరు, కాని ఎవరైనా ప్రాణాలను పోయగలరా? ఎంతటి నిమ్న జాతికి, అధమ జాతికి, నిరర్ధకమైన జాతికి చెందిన వాటికి కూడా ప్రాణము ప్రియమైనదే ఎవరూ తమ ప్రాణాలు

**హింస ఎన్నడూ దయను తన దగ్గరకు కూడా రానీయదు**

అర్పించటానికి సిద్ధపడరు. మన మనసులో దయ అనే భావం వుంటే ఈ జీవితం అమూల్యమైనది. జనులు తాము స్వయంగా నిర్దయులై వుండి దేవతల నుండి దయను అర్థిస్తారు. దేవతలకు మానవులు, పశువులూ ఇద్దరూ సమానమే. సర్వ జీవులూ సమానమేనన్న జ్ఞానము ఎవరికి కలుగుతుందో వారే శ్రేష్ఠమైన మానవులు".

బుద్ధ భగవానుడింకా ఇలా అన్నారు " చూడండి ఏ పశువులైతే మానవుల నాధారంగా చేసుకుని వారిపైన నమ్మకంతో జీవిస్తాయో, గడ్డి గాదము తిని అమృతతుల్యమైన పాలనిస్తాయో, జనులు అలాంటి వాటి గొంతుకలపై కత్తులనాడించడానికి వెనుకాడటం లేదు. పశువులను చంపడం ఘోరమైన పాపం.... ఇలా చెయ్యడం వల్ల అంటే రక్తపాతం ద్వారా, హత్యల ద్వారా దేవతలు ఎన్నటికి ప్రసన్నులు కారు. అత్యాచారం చేసేవారు, జీవులను చంపేవారు వాటి ఫలితాలను అనుభవించటానికి సిద్ధంగా వుండాలి" అన్నారు.

బుద్ధభగవానుడి దయా ప్రేమతో నిండిన ఈ ఉపదేశాన్ని విని బింబిసారుడు పశువులను బలి ఇవ్వడం మానివేశాడు. అంతే కాదు ఆయన బుద్ధుని ఆదేశాలు ప్రజలందరికి ప్రకటించాడు.

అందుచేత జంతువుల పట్ల దయ, కరుణ కలిగి వుండండి. ఎవరైతే జంతువులను, పక్షులను చంపుతారో వారు నిర్ధయులు, చండాలురని తెలుసుకోండి.


# మహాత్ముల అభిప్రాయాలు




"మాంసం భుజించడం ఒక వ్యక్తి స్వభావాన్ని హింసాత్మకం చేస్తుంది- మాంసం తినేవారి, మత్తుపానీయాల్ని, త్రాగేవారి శరీరాలు మరియు వీర్యకణాలు కూడా కలుషితమవుతాయని చెప్పారు".

**- స్వామి దయానంద సరస్వతి**

**జంతువుల పట్ల క్రూరత్వం పరమాత్మను అవమానించడమే అవుతుంది.**




మహాత్మాగాంధీగారి పుత్రుడు తీవ్ర అస్వస్థుడయినప్పుడు, మాంసపు పులుసు(Meat soup) తీసుకోకపోయినట్టయితే పిల్లవాడు బ్రతకడం అసాధ్యమని వైద్యులు ఆయనతో చెప్పారు. గాంధీ గారు వారి సలహాని త్రోసిపుచ్చారు. అయినా మాంసం పులుసు తీసుకోకుండానే వారి అబ్బాయి కోలుకున్నాడు. -మహాత్మాగాంధీ



ఎవరు మాంసం తినడం లేక మత్తు పానీయాలు సేవించడం చేస్తారో వారు మనిషి రూపంలో వున్న మృగాలు, వారు ఈ భూమికి భారం.

- ఆచార్య చాణక్య




"అహింసే పరమోత్తమ ధర్మం" సాత్వికాహారాల యిన పళ్ళు, పాలు, ఆకుకూరలు, పిండి పదార్థాలు ఇత్యాది వాటిని తగు మోతాదులో తీసుకోవాలి.

- రమణ మహర్షి



ఎవరు జంతువులను చంపడం మీదే జీవిస్తారో వారు చివరకు అనారోగ్యంతో దారిద్ర్యంతో బాధపడటమే కాదు, అవమానాలకు కూడా గురవుతారు.


- తిరువల్లువార్



"ఎంతకాలం మానవులు జీవులను హింసిస్తుం టారో, చంపుతుంటారో అంతకాలం యుద్ధాలు ఉంటాయి"

- జార్జి బెర్నాడ్ షా

**తినడంలో, త్రాగడంలో, నిద్రలో, సుఖాలలో మునిగి పరమాత్మను మరిచావు.**



"అహింస అన్నది స్వచ్ఛమైన ప్రేమ", ప్రేమ ఎక్కడ వుంటుందో అక్కడ అహింస వుటుంది.

అహింస మనల్ని భయం రహితుల్ని చేస్తుంది. ఏనుగు పాదముద్రలో అన్ని జంతువుల పాదముద్రలు ఎలా అమరుతాయెూ అలాగే మహోన్నత అహింసలోనే అన్ని మతాల ధర్మాలు ఇమిడి వున్నాయి.

- స్వామి శివానంద




మాంసం తినడం వల్ల ఊర్థ్వలోకవాసులు మనకు అందించే సందేశాలు అందుకోలేము.

నాకు చంపబడిన జీవుల ఆత్మల నుంచి అందిన సందేశం. "మానవులు ఆహారంగా మా మాంసాన్ని ఉపయోగించుకున్నా ఫరవాలేదు. కానీ దాని కోసం మా పట్ల వారు ప్రవర్తించే విధానమే మాకు అత్యంత బాధాకరం".

ఆలోచించండి జంతువులు మానవుల్ని ఎలా ప్రేమిస్తాయో, మానవుల ఆనందం కోసం ఎంత కష్టపడతాయో, ఆఖరుకు తమ ప్రాణాలను సైతం బలిస్తాయి. అందుచేత వాటిని హింసించకండి, ప్రేమించండి.

- డోరీన్ వర్చ్యూ




"ఎవరైతే జీవుల మాంసాన్ని చీల్చుతారో వారి మాంసం కూడా చీల్చబడుతుంది. ఎవరైతే ఎముకలను విరుస్తారో వారి ఎముకలు కూడా విరువబడతాయి. ప్రతీ రక్తపు బొట్టుకి తన రక్తపు బొట్టుతో లెక్కలు అప్పగించవలసిందే" ఇది తిరుగులేని న్యాయ సూత్రం.

- మైఖల్ నేమి

## "ఓషో"

జంతువులు మన సహోదరులు. మీరు తినడానికి ఒక జంతువును చంపడం అనే ఆలోచనే అసహ్యాకరమైనది. ఏ జంతువూ చంపబడకూడదు. భూమి మీద ఏ జంతువు అవసరం వున్నా అది

**పరమాత్మ తనపై దయ చూపించాలని కోరుకునేవాడు. అమాయక జీవులపై దయ చూపాలి.**



జీవిస్తుంది. అలాగే ఏ జంతువు అవసరం భూమి మీద వుండదో! దాన్ని చంపినా చంపకపోయినా భూమి మీద అది అదృశ్యమైపోతుంది.

\- - -

భూమి మీద తినడానికి ఎంతో శాకాహారం వుండగా, ఆహారం కోసం జంతువును చంపడమన్నదే ప్రశ్న. శాకాహారం లేకపోతే అది వేరే సంగతి. కానీ ఎంతో శాకాహారం వుంది. మరి ఎందుకు చంపాలి? ఒక శరీరాన్ని ఎందుకు నాశనం చెయ్యాలి?

అలాంటపుడు నరమాంస భక్షకుడు కావచ్చు కదా? మనిషిని చంపడంలో తప్పేమిటి? మనిషి యొక్క మాంసం ఇంకా బాగుంటుంది కదా? మనిషి మాంసం తినడం ప్రారంభించవచ్చు కదా?

\- - -

జంతువులు మానవులకు సోదరులు, తోబుట్టువులు, కారణం వారి నుండే మానవుడు వచ్చాడు. అది మన కుటుంబం. మానవుణ్ని చంపడమంటే ఎదిగిన జంతువును చంపడం. జంతువును చంపడమంటే ఎదుగుతున్న మానవుడిని చంపడం. రెండూ సమానమే! కారణం ఒకనాటి జంతువులే మనుష్యులుగా పరిణామం చెందుతున్నారు.

ఒకటవ తరగతి చదువుతున్న బాలుడిని చంపినా యూనివర్శిటీలో అత్యున్నత విద్యనభ్యసిస్తున్న యువకుడిని చంపినా పెద్ద తేడా ఏమీ వుండదు.

నీ భార్యను చంపి తినవచ్చు కదా? ఆవిడ చాలా అందంగా, చాలా మధురంగా వుంటుంది కదా? మీ తల్లిని ఎందుకు తినకూడదు! నీ భర్తను, పిల్లలను కూడా తినవచ్చు. వారు చాలా రుచిగా వుంటారు.

యీ సమస్య మతపరమైనది కాదు. మీకు మళ్ళీ గుర్తు చేయాలనుకుంటున్నాను. అది సౌందర్యోపాసనకు చెందిన విషయం.

సెయింట్ ఫ్రాన్సిస్ భుజాలపై పక్షులు వచ్చి కూర్చునేవి. చేపలు అతనిని చూడటానికి నదిలోంచి పైకి ఎగిరేవని చెప్పే కథలున్నాయి. జంతుజాలితో అతనికి అటువంటి బంధుత్వం ఉండేది. అతను మొక్కలను సహోదరి అని, పక్షులను సహోదరులు అని సంబోధించేవాడు.

**శవం కాలుతుంటే దుర్గంధం వస్తుందని, అరిష్టమని ఊరిబయట శ్మశానంలో కాలుస్తాం. మరి మరణించిన జీవి యొక్క మాంసాన్ని వేయిస్తే అలాంటి దుర్గంధమే వస్తుంది కదా?**

వారే కాదు భారతదేశానికి చెందిన సమస్త భక్తాగ్రేసరులూ మరియు ప్రవక్తలయున కపిల, వ్యాస, పాణిని, పతంజలి, శంకరాచార్య ఆర్యభట్ట మొదలగువారు ఇస్లాముకు చెందిన సర్వసూఫీ భక్త శిఖామణులు మరియు 'అహింసో పరమోధర్మః" అని అహింసా పాఠాన్ని బోధించిన గౌతమబుద్ధుడు, జీసస్, మహావీరుడు, గురునానక్ మరియు మహాత్మాగాంధీ - వీరంతా సన్మార్గ చింతనలకు మరియు ధర్మావలంబనకు మాంసాహారం అవరోధమని తెలియచేసారు. చివరిగా "శాకాహారమే శ్రేష్టమని మాంసాహారం పాపాహారమని తెలుసుకోండి". మాంసాహారం మానండి. శాకాహారులు కండి. ధ్యానం చెయ్యండి.






# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం)- రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం)- రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) భగవంతుడంటే - రూ.130/-
5) సత్యమార్గం - రూ.130/-
6) ఆత్మ శాస్త్రం - రూ.130/-
7) ధ్యాన శాస్త్రం - రూ.130/-
8) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) - రూ.130/-
9) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) - రూ.130/-
10) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.130/-
11) ధ్యాన శక్తి - రూ.130/-
12) తెలుసుకోండి - రూ.130/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
14) గీతాసందేశం - రూ.100/-
15) కర్మ సిద్ధాంతం - రూ.80/-
16) ధ్యానమంటే ? - రూ.80/-
17) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
18) జ్ఞాన జ్యోతి - రూ.70/-
19) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
20) దుఃఖ నివారణామార్గం- రూ.60/-
21) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
22) త్రివిధాలు - రూ.60/-
23) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
24) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
25) అతీంద్రియ శక్తులు - రూ.60/-
26) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.60/-
27) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.60/-
28) భూతదయే దైవత్వం - రూ.60/-
29) ఆలోచించండి - రూ.60/-
30) షిరిడీ సాయి సందేశాలు - రూ.60/-
31) సంకల్పమంటే? - రూ.50/-
32) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
33) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
34) నిర్వాణ మార్గం - రూ.50/-
35) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
36) మౌన ధ్యానం - రూ.40/-
37) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.130/-
38) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
39) శాకాహారమే మానవాహారం- రూ.15/-
40) అహింస మరియు శాఖాహారం - రూ.15/-

పుస్తకముల కొరకు :
**తటవర్తి వీర రాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా.
సెల్ : 9440309812, 9490171853

# ప్రేమతో పెంచేది... క్రూరంగా చంపడానికా?





## మనం మానవులం - ప్రేమే మన మతం!

Please visit our website "www.pss.org"

## ఆకులు తినే మేకలు కొండలెక్కుతుంటే.... మేకలు తినే మానవులు మంచాలెక్కుతున్నారు





**పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ - ఇండియా**